# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | గురువారం 22 ఆగస్టు 2024 | తెలుగు దినపత్రిక





## భూ సేకరణ ప్రారంభించండి

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం పనుల్లో వేగం పెంచండి
- పారదర్శకంగా భూ సేకరణ చేపట్టాలి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే అలైన్‌మెంట్ ఉండాలి
- రోజు వారీగా ప్రగతిని సీఎస్ కు అందించాలి
- ఆర్ఆర్ఆర్ ప్రగతి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

నడి చెరువు లో ఓ మంత్రి ఇల్లు



# హైడ్రామా


## పార్టీల్లో ఫార్మ్ హౌజ్‌ల కల్లోలం

## నేతల్లో వణుకు... పార్టీల్లో బెనుకు

- కాంగ్రెస్ నేతల ఫాం హౌజ్‌ల వద్ద బీఆర్ఎస్ మీడియా షో
- హస్తం లీడర్ల ఫాం హౌస్‌లు కూల్చరేం: కేటీఆర్
- ఆ ఫాంలు కూల్చొద్దని కోర్టుకెక్కిన బీఆర్ఎస్
- హైడ్రా రద్దు పై ఒక్కటైన బీజేపీ, ఎంఐఎం
- పొంగులేటి సహా మెజార్టీ మంత్రుల వ్యతిరేకం..
- అఖిలపక్షంతో కౌంటర్
- హైడ్రా... పరిధులేంటని ప్రశ్నించిన హైకోర్టు..

చెరువులు, నాలాలను కబ్జా చేసి దర్జాచేసి భవంతులు నిర్మించుకున్న బడా నేతల భరతం పడుతున్న హైడ్రా రాజకీయ పార్టీలను షేక్ చేస్తోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను హైడ్రా కమిషనర్ గా నియమించడంతో పాటు దాని పరిధిని పెంచి విస్తృత అధికారాలిచ్చారు. దీంతో హైదరాబాద్ లో అక్రమ కట్టడాలపై హైడ్రా ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకు 120 భవనాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రహరీలు కూల్చివేసింది. గండిపేటలోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. ఒక్క గండిపేటలోనే 25కి పైగా భవనాలను కూల్చేశారు. చందానగర్ సర్కిల్ మదీనాగూడ చెరువులో 3, బాచుపల్లిలోని ఎర్రకుంటలో 3, గాజులరామారంలో 42 భవనాలను నేలమట్టం చేశారు. ఇక హైడ్రా అదను చేసుకుని చిత్రపురి కాలనీలో అక్రమ కట్టడాలను స్థానిక అధికారులు కూల్చేశారు. హైడ్రా కన్ను శివారు ప్రాంతాల్లోని పార్టీ నేతల ఫాం హౌజ్ లపై దృష్టి పడిందన్న వార్త ప్రచారం జరుగడంతో తేలు కుట్టిన దొంగల్లా పార్టీల నేతలందరూ ఒక్కటవుతున్నారు. ఓ రాజకీయ పార్టీ హైడ్రాపై కోర్టుకెక్కితే సిద్ధాంతాలను పక్కన పెట్టి ఎంఐఎం, బీజేపీలు ఒక్కటై హైడ్రాపై గరంగరం అవుతున్నాయి. ఇక కాంగ్రెస్ మంత్రులు చెరువు గర్భంలో నిర్మాణాలు చేపట్టారంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా కెమెరాలు ఫాం హౌజ్ ల వద్ద హల్ చల్ చేస్తున్నాయి.

- జనపదం, హైదరాబాద్ బ్యూరో




వివరాలు 3వ పేజీలో







ఎనుముల తిరుపతి రెడ్డి ఇల్లు | పట్నం మహేందర్ రెడ్డి ఇల్లు | మంత్రి పొంగులేటి ఇల్లు

### హైడ్రానా.. హై డ్రామానా..?



హైడ్రానో.. హై డ్రామానో అర్థం కావడం లేదు. నిర్మాణాలు అక్రమమని కూల్చేస్తున్నారు సరే.., కడుతున్నప్పుడు ప్రభుత్వాలేం చేశాయి, వాటికి అనుమతులు ఎలా ఇచ్చారు. హైడ్రాపై సామాన్యులకు అనుమానాలున్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. కూల్చివేతలపై సమగ్రమైన కార్యాచరణ తీసుకోవాలి. కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు. ఆక్రమణల నుంచి చెరువులు, పార్కులు, మైదానాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### కేటీఆర్ ఫాం హౌజ్‌ను స్వయంగా చూశా..



కేటీఆర్ ఫాం హౌజ్‌కు నేనే స్వయంగా వెళ్లి చూసొచ్చా. ఆ సమయంలో కేటీఆర్ భార్య అక్కడేవో పనులు కూడా చేయిస్తున్న దృశ్యం కూడా నేను చూశా. ఇప్పుడు నాకు ఫాం హౌజే లేదు., కావాలంటే చూసుకోండి అని ఆయన మాట్లాడుతున్న తీరుతో బాధనిపిస్తున్నది. కేటీఆర్ ను కుటుంబ సభ్యులు ఇప్పటికైనా మంచి డాక్టర్ కు చూపిస్తే బాగుంటుంది. అసలే యువకుడు., అలా వదిలేస్తే భవిష్యత్ ఇబ్బందికరంగా ఉండదా..? నిబంధనలకు విరుద్ధంగా ఉంటే హైడ్రా కేటీఆర్ ఫాం హౌజ్ ను కూడా కూల్చేస్తుంది.

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

### నాకు ఫాం హౌజ్ లేదు..



నాకు స్వయంగా ఎలాంటి ఫాం హౌజులు లేవు. నేను నా స్నేహితుడి ఫాం హౌజ్ ను లీజుకు తీసుకున్నా. అది నిబంధనలకు విరుద్ధంగా ఉందని తెలిస్తే స్వయంగా నేనే దగ్గరుండి కూల్చేయిస్తా. కేవలం బీఆర్ఎస్ టార్గెట్ గా కాకుండా నిజంగా హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే మంత్రుల ఫాం హౌజులను కూల్చి అప్పుడు ఇతరుల వాటి జోలికి రావాలి. ఒక వర్గానికి చెందిన వారివే ముట్టుకుంటున్న తీరే ఆక్షేపనీయం. జన్వాడ ఫాం హౌజ్ కూల్చొద్దని కోర్టును ఆశ్రయించాం. న్యాయంగా పోరాడుతాం.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### బీఆర్ఎస్ లీడర్ల ఫామ్ హౌజ్ లు

కేటీఆర్– జన్ వాడ
సంతోష్ రావు - అజీజ్ నగర్
కవిత - శంకర్ పల్లి
గణేశ్ గుప్తా - ఖానాపూరం
నవీమన్ రావు
శంబీపూర్ రాజు



### హైడ్రా విధివిధానాలేంటి..?

"నిర్మాణాల కూల్చివేత లకు హైడ్రా కున్న పవర్ ఏంటి..? ఇప్పటి వరకు ఎన్ని బిల్డింగ్ లు కూల్చారు.? నేలమట్టం చేయడానికి ముందు ఎలాంటి చట్టబద్ధమైన నిబంధనలు పాటిస్తున్నారు. అవసరమైతే హైడ్రా కమిషనర్ ను కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తాం. జన్వాడ నిర్మాణానికి ఎవరు అనుమతి ఇచ్చారు. ఇంత సీరియస్ డిస్కషన్ జరుగుతుంటే హైడ్రా తరుపు న్యాయవాది విచారణ కు రాకపోవడానికి కారణమెంటి..? మున్సిపల్ అధికారులు ఎఫ్టీఎల్ ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారా.."

- ఏఏజీకి హైకోర్టు సూటి ప్రశ్నలు

### ఎవరివైనా కూలగొట్టుడే..



ఇల్లీగల్ నిర్మాణాలు కూల్చాలని చెప్పిన కేటీఆర్., కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం విడ్డూరంగా ఉంది. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఎవరి భూములున్నా కూల్చడం పక్కా. బీఆర్ఎస్ వాళ్లకు ఎమైనా ఇబ్బందులుంటే హైడ్రాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వండి.., కమిషనర్ పరిశీలించి చర్యలు తీసుకుంటుంది. అంతేగానీ హైడ్రాను దూషిస్తూ, తప్పును కప్పిపుచ్చునేందుకు యత్నించడం అవకాశ వాదమే. బీఆర్ఎస్సే కాదు, ఏ పార్టీకి చెందిన వారిపైనా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేసుడే.

- చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ

### జన్వాడ తతంగం అంతా తెలుసు..



గతంలో జన్వాడ ఫామ్ హౌజ్ లో జరిగిన తతంగం అంతా ప్రజలకు తెలిసిందే. ఫిరంగి నాలాను పూడ్చేసి ఆ ఫామ్ హౌజ్ ను నిర్మించారు. కల్వకుంట్ల శైలిమా పేరుతో రిజిస్ట్రేషన్ అయిన ఫామ్ హౌజ్ పూర్తిగా ఎఫ్ టీఎల్ జోన్ లో ఉంది. పేరుకే ప్రదీప్ గానీ, అది కేటీఆర్ దే. పదేండ్లు యథేచ్ఛగా భూములను ఆక్రమించుకున్నారు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు ఎక్కడెక్కడ భూములున్నాయో ఆధారాలున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కు గ్రీన్ ట్రిబ్యునల్ గురించి తెలీదా..? తప్పు చేస్తే ఎవరూ అతీతులు కాదు.

- మహేష్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### వీటిని కూల్చే దమ్ముందా..?

హైడ్రా.. ఓ హడల్.. చెరువుల మొహాన చిరునవ్వులు పూయిస్తూ.., శిఖాలకు స్వేచ్ఛను ప్రసాదిస్తూ., బడా లీడర్ల భరతం పడుతున్న ఓ సవాల్. అతీతం కాదు., అనుయాయులు కాదు అనే మొండితనంతో వెళ్తున్న హైడ్రా.. ఇదిగో చూడు.. ఈ ఫామ్ హౌజ్ లను కూల్చే దమ్ము నీకుందా..? తేల్చుకో.., నీ పనితో అదేమిటో చూపికా...

**ఎఫ్టీఎల్ పరిధిలోని కాంగ్రెస్ నేతల ఫామ్ హౌజ్ లు..**

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,
పట్నం మహేందర్ రెడ్డి
హిమాయత్ సాగర్

ఇంద్రకరణ్ రెడ్డి - లేక్ వ్యూ

జానారెడ్డి
గుత్తా సుఖేందర్ రెడ్డి
గండిపేట

కేవీపీ, కోమటిరెడ్డి , వివేక్
మొయినాబాద్

ఎనుముల తిరుపతి రెడ్డి
దుర్గం చెరువు
జితేందర్ రెడ్డి



## 8 నెలలైనా పనికాలే..

- మంత్రులు చెప్పినా పట్టించుకుంటలేరు..
- ధరణి సమస్యపై బాధితుడి ఆవేదన..
- తలకిందులుగా తపస్సు చేసి గోల్డ్ మెడలిస్ట్ నిరసన..

**జనపదం, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం మండలం మంగళ్ పల్లి సర్వే నెంబర్ 374 లోని 1-32 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 8 నెలలుగా ఆఫీస్ చుట్టు తిరిగిన విసిగిపోయిన జీవన్ తలకిందులుగా తపస్సు చేసి నిరసన తెలిపారు. ముంబాయిలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో గోల్డుమెడల్ సాధించిన ఆయన సొంత పొలంలో మట్టి పాత్రల తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న క్రమంలోనే భూమి ప్రొహిబిటెడ్ లో ఉన్న విషయం తెలిసింది. భూ సమస్య పరిష్కరించండంలో అధికారులు విఫలం చెందారని, ఉన్నత చదువులు చదివిన తనకే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్యులకు అధికారులు ఎలా అందుభాటులో ఉంటారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో ను వివరణ కోరగా తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని పరిష్కారానికి సమయం పడుతుందన్నారు.



## మూడు గంటలు ముచ్చెమటలు..

- కాళేశ్వరం స్కాం పై బహిరంగ విచారణ
- కమిషన్ క్రాస్ ఎగ్జామింగ్
- మాజీ ఈఎన్సీ పై ప్రశ్నల వర్షం
- తప్పులు జరిగాయని ఒప్పుకున్న మురళీధర్

3

## రుణమాఫీ దగా..

49 వేల కోట్లన్నారు.. చేసింది 30 శాతమే..

- భట్టి లెక్కలు వింటే మాఫీ వట్టిదేనని తేలింది..
- రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి
- నేడు మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు..
- మాజీ మంత్రి కేటీఆర్

2

## దేశం కోసం బీజేపీ

కమలం కేడర్ బేస్డ్ పార్టీ

- వ్యక్తులు, కుటుంబం ముఖ్యం కాదు..
- ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు
- ఉద్యమంగా సభ్యత్వ నమోదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

3

## ఇన్ ఫార్మర్ నెపంతో హత్య..



- మహిళను చంపిన మావోయిస్టులు
- చెన్నాపురం సమీపంలో మృతదేహం
- విప్లవ ద్రోహి నీల్సో.. అంటూ లేఖ..

3

# హైడ్రామా..

- పార్టీల్లో ఫార్మ్ హౌజ్‌ల కల్లోలం
- నేతల్లో వణుకు.. పార్టీల్లో బెనుకు
- కాంగ్రెస్ నేతల ఫాం హౌజ్ ల వద్ద బీఆర్ఎస్ మీడియా షో
- కాంగ్రెస్ లీడర్ల ఫాం హౌస్‌లు కూల్చరేం - కేటీఆర్
- ఆ ఫాం లు కూల్చొద్దని కోర్టు కెక్కిన గులాబీ..
- హైడ్రా రద్దు పై ఒక్కటైన బీజేపీ, ఎంఐఎం
- హైడ్రాపై పొంగులేటి సహా మెజార్టీ మంత్రుల వ్యతిరేకం
- అఖిలపక్షంతో కౌంటర్



**జనపదం, హైదరాబాద్:** హైడ్రా చుట్టు రాజకీయం ముసురుతోంది. ఆ మాటకొస్తే అధికార పక్షం ఒకవైపు, మిగతా అన్ని పక్షాలు మరోవైపు అన్నట్టుగా వ్యవహారం నడుస్తోంది. తమ వరకు వచ్చే సరికి అంతా ఆ తాను ముక్కలే అన్నట్టుగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసిపోతున్నాయి. బీజేపీ, మజ్లిస్ కూడా ఒకే కుత్తికగా హైడ్రాను చెరబడుతున్నాయి. ఫామ్ హౌస్ ల లొల్లి జోలికికొస్తే బాగుండదనే రేంజ్ లో కమిషనర్ కు వార్నింగ్ ఇవ్వడానికి కూడా వెనకాడని తీరుగా తెగింపునకు పాల్పడుతున్నాయి. అంతా శాఖాహారులే అయితే అసలు ఏడబోతంది అన్నట్టుగా నాయకులంతా కబ్జాలను కట్టడి చేయాలనుకుంటున్నవారే అయితే మరి ఈ ఫామ్ హౌజ్ లు ఎక్కడ నుంచి వెలిసినట్టు., చెరువు శిఖాలు, ఎఫ్టీఎల్ పరిధుల్లో నిర్మాణాలు ఎవరు చేసినట్టు అనేది అంతుచిక్కకుండా ఉందని సామాన్యుడు ముక్కున వేలేసుకుంటున్నాడు.

## నేతల్లో వణుకు.. పార్టీల్లో బెనుకు

హైడ్రా పనితీరుతో నేతల్లో వణుకు మొదలైంది. ఇన్నాళ్లు అడ్డూ అదుపు లేకుండా చేసిన కబ్జా పర్వాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చే ప్రమాద ఘంటికలు మ్రోగుతుండడంతో అంతా బెదురుతున్నారు. కాలుకాలిన పిల్లిలా ఎవరికి వారుగా పిసుక్కుంటున్నారు. తెలంగాణ రాష్ట్రావిర్భావానికి ముందు, తర్వాత దాదాపు రెండు దశాబ్దాలుగా సాగిన విచ్చలవిడి ఆక్రమణదారులు భయాందోళనకు గురవుతూనే పైకి మాత్రం మేకపోతు గాంభీర్యంగా ఫోజులు కొడుతున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగా ఎవరి ప్రభుత్వంలో వారు తమ పనిని కానిచ్చుకుని ఇప్పుడు నిజాలు తేల్చే కమిషనర్ రంగంలోకి దిగడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేతల ఫాం హౌజ్ లను కూల్చే దమ్ముందా అని కేటీఆర్ అండ్ బీఆర్ఎస్ టీం ప్రశ్నిస్తుంటే., నాకు ఫాం హౌజే లేదన్నట్టుగా బిల్డప్ ఇవ్వడం ఎందుకు అన్నీ అవే తేలుస్తాయి.. హైడ్రా ముందు నిలబడాల్సి వస్తుందిలే.. అని హస్తం నేతలు కౌంటర్ ఇస్తున్నారు. కాగా, హైడ్రాపై మంత్రి పొంగులేటి సహా మెజార్టీ మంత్రుల వ్యతిరేకించడం చర్చనీయాంశం అవుతున్నది. నిజానికి పొంగులేటి ఫాం హౌజ్ ముమ్మాటికి ఎఫ్ టీఎల్ పరిధిలోనే ఉందనే వాదన ఉంది. ఇప్పుడు హైడ్రా రంగప్రవేశంతో దానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉండడంతో తన నిజమైన అభిప్రాయాన్ని బహిరంగంగానే వెల్లగక్కుతూ మంత్రి తన అసలు రూపాన్ని చూపుతున్నారు.

### హైడ్రా రద్దు పై ఒక్కటైన బీజేపీ, ఎంఐఎం

మరి ముఖ్యంగా ఉప్పు, నిప్పుల మాదిరిగా ఉండే కమలం, పతంగం ఇప్పుడు హైడ్రా పుణ్యాన ఒక్కటయ్యాయి. భిన్న అభిప్రాయాలు, వేర్వేరు విధానాలు కలిగిన ఈ రెండు పార్టీలు తమ స్వార్థం కోసం మాత్రం ఒక్కటై ఒకే గొంతుకను వినిపిస్తున్నాయి. హైడ్రా విధివిధానాలపై పెదవి విరుస్తూ, పనితీరును ఎక్కిరిస్తూ తమ అక్కసును వెల్లగక్కుతున్నాయ. హైదరాబాద్ లోని చెరువులకు చెర తొలగుతుందన్న కనీసం విచక్షణను కూడా మరిచి ఆ రెండు పార్టీలు ప్రభుత్వ తీరును తప్పుబట్టి తమ నిజస్వరూపాన్ని చూపుతున్నాయి.

# భూ సేకరణ ప్రారంభించండి

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం పనుల్లో వేగం పెంచండి
- పారదర్శకంగా భూ సేకరణ చేపట్టాలి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే అలైన్‌మెంట్ ఉండాలి
- రోజు వారీగా ప్రగతిని సీఎస్‌కు అందించాలి
- ఆర్ఆర్ఆర్ ప్రగతి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగానికి వెంటనే భూసేకరణ ప్రారంభించాలని, పారదర్శకంగా పనులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఉండాలన్న సీఎం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని సూచించారు. ఆ మార్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని సూచించారు. పనుల పురోగతిపై కలెక్టర్లు రోజువారీ నివేదిక ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీపై రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పనుల పురోగతిపై సీఎం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. భూములిచ్చే రైతులకు న్యాయం చేస్తూ ఆర్ఆర్ఆర్ భూసేకరణ పూర్తి పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ప్రయాణం సాఫీగా సాగాలి..

అర్బన్ తెలంగాణ, రూరల్ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఔటర్ రింగ్ రోడ్డు , రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానానికి అనువుగా రహదారుల ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రహదారుల నిర్మాణానికిముందే ఎక్కడికక్కడ ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలన్న సీఎం, సిగ్నల్ ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ అనుసంధానానికి అను వుగా రేడియల్ రోడ్లు ఉండాలని, ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

### రోజూ వారీగా సమాచారం ఇవ్వాలి

భూసేకరణ వేగం పెరగాలని ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పరిధిలోని కలెక్టర్లు రోజువారీగా ఏం చేశారు, ఏం పురోగతి సాధించారు, దక్షిణ భాగంలో భూసేకరణ ప్రక్రియ, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతీరోజు సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భూసేకరణలో పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సీఎస్ శాంతికుమారితో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్డీ షానవాజ్ ఖాసీం ఆయా జిల్లాల కలెక్టర్లు, రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పనుల పురగోతిని ఆ గ్రూప్‌లో అప్‌డేట్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశం మధ్య పురోగతి తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి–ఆమన్‌గల్–షాద్‌నగర్–చౌటుప్పల్ మార్గానికి సంబంధించి వెంటనే భూ సేకరణ ప్రారంభించాలని పేర్కొన్నారు. ఉత్తర భాగంగా ఇప్పటికే భూ సేకరణ చాలావరకు పూర్తైనందున దక్షిణ భాగంలో ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఇక ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలోని (చౌటుప్పల్–ఆమన్‌గల్ –షాద్ నగర్ –సంగారెడ్డి (189.20 కి.మీ.)మార్గానికి సంబంధించి భూ సేకరణ,అలైన్‌మెంట్ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు.

### సమస్యలుంటే కేంద్రంతో చర్చించాలి

రహదారి విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని అదే సమయంలో పనులు ముందుకుసాగాలని సీఎం రేవంత్ సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో సీఎం కొన్ని మార్పులు సూచించారు. ఆ మార్పులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలే లక్ష్యంగా అలైన్‌మెంట్ ఉండాలని, ఆ విషయంలో పారదర్శకంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## సర్కార్ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- విషజ్వరాలకు బలవుతున్న జనం
- మాజీ మంత్రి హరీష్ రావు




**జనపదం, సిద్దిపేట:** డెంగీ, మలేరియా, గున్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం దారుణమని, డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. జీపీలు, మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసి పారిశుధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే తాము కోరామని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం తమ సూచనలను పెడచెవిన పెట్టిందని, సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలకు ప్రాణాలు పోయేవి కావన్నారు. ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుధ్య చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుందని, కానీ ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదని, దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్ లు చేపట్టలేదని మండిపడ్డారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయయపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయన్నారు. పారిశుధ్యం పడకేయడంతో ప్రతీ రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారని చెప్పారు. ఆసుపత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పరువునష్టం కేసులో సీఎంకు నోటీసులు

**జనపదం, లీగల్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాంపల్లి స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను వచ్చే నెల 25వ తేదీలోపు అందజేయాలని ఆదేశించింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు వేసిన పరువు నష్టం కేసు విచారణలో భాగంగా ఉత్తర్వులు వెలువరించింది. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో రేవంత్ తప్పుడు ప్రచారం చేశారని కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని నిరాధార ఆరోపణలు చేశారని, దీనివల్ల బీజేపీకి పరువు నష్టం కలిగిందని ఆయన పిటిషన్‌లో తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు పిటిషనర్ల వాంగ్మూలం సేకరించింది. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియోలను పరిశీలించింది. ఈ కేసులో రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

# నాకు ఫామ్ హౌజ్ లేదు..


- బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూలగొట్టిస్తా..
- మాజీ మంత్రి కేటీఆర్



**జనపదం, హైదరాబాద్:** బఫర్ జోన్‌లో కానీ, ఎఫ్టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదని, మీరు చెబుతున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే తానే దగ్గర్నుండి కూలగొట్టిస్తానని, నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందేనన్నారు. అయితే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంటని ప్రశ్నించారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారని, అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయని, కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంటని..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎఫ్టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్లి కూలగొడదామన్నారు. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉందన్నారు. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండన్నారు. తన పేరు మీద ఏ ప్రాపర్టీ లేదని, తాను లీజు మీద ఉన్నానని చెప్పారు.

# రుణమాఫీ దగా..

- 49 వేల కోట్లన్నారు.. చేసింది 30 శాతమే..
- భట్టి లెక్కలు వింటే మాఫీ వట్టిదేనని తేలింది..
- రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి
- నేడు మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు..
- మాజీ మంత్రి కేటీఆర్




**జనపదం, బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీ కాదని.. రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని, భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయిందని చెప్పారు. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..? లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ.. గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయని, ఈ ఆందోళనలు మొదటి అడుగు మాత్రమేనని, రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాము గతంలో రుణమాఫీ చేసినప్పుడు, రైతుబంధు వేసినప్పుడు ఎలాంటి ఆంక్షలు పెట్టలేదని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెద్ద ఎత్తున తగ్గాయన్నారు.


### ప్రజల దృష్టి మళ్లించేందుకు బజారు భాష..

పచ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా.. కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిసెంబర్ లో 49 వేల కోట్లు, జనవరిలో 40,000 కోట్లు.. జూలై వచ్చేసరికి రూ. 31 వేల కోట్లకు ఎలా చేరిందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండని, ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయని, మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## కేటీఆర్ ఫాం హౌజ్‌కు వెళ్లొచ్చా..

### ఆయనను మంచి డాక్టర్‌కు చూపించాలి..

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**జనపదం, హైదరాబాద్:** కేటీఆర్ ఫాం హౌజ్ దగ్గర కార్ తీసుకొని సెల్ఫ్ డ్రైవ్ చేసుకుని వెళ్లి మరి చూసి వచ్చానని మంత్రి కోమటి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జీవో 111 లో ఫామ్ హౌజ్ నిర్మించుకున్నారని, 25 ఎకరాల విస్తీర ణంలో హౌజ్ ఉందన్నారు. ఫాం హౌస్ కు వెళ్లినప్పుడు కేటీఆర్ భార్య అక్కడ పని చేయిస్తుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే హైడ్రా అధికారులు కేటీఆర్ ఫాం హౌజ్ కూల్చేస్తారన్నారు. రేవంత్ రెడ్డికి ఫాం హౌజ్ ఎక్కడుందో కేటీఆర్ చెప్పాలన్నారు. ధరణి పేరుతో చెరువులు మాయం చేశారని, హైడ్రా పని తీరుపై ప్రజలు హర్షిస్తున్నారన్నారు. బావబామ్మర్దులను బీఆర్ఎస్ కాదు, బీజేపీ అని పిలవాలన్నారు. ఢిల్లీలో ఏం జరుగుతుందో తనకు తెలుసని, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయం అన్నారు.

### కేటీఆర్‌ను డాక్టర్‌కు చూపించాలి..

కేటీఆర్ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కుటుంబ సభ్యులకు మంత్రి సూచించారు. ఆయన యువకుడని ఏమైనా అయితే ఇబ్బంది అవుతుందని, ఆయనను చూస్తే జాలేస్తోందన్నారు. పదేళ్లలో ఒక్కసారి కూడా అంబేద్కర్ కి దండ వేయని వారు ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తామంటుంటే నవ్వొస్తుందన్నారు. జన్వాడే కాదు, అక్రమంగా ఉన్న ఎవరి కట్టడాలను వదిలేది లేదన్నారు. అందరం కలిస్తేనే తెలంగాణ వచ్చిందని, దేశం కోసం మాంసపు ముద్ద ఆయిన రాజీవ్ విగ్రహం పెడితే తట్టుకోలేక పోతున్నారన్నారు. వాజ్‌పేయ్ విగ్రహం పెడితే మంచిదేనని, ఏదైనా మంచి ప్లేస్ చూసి ఆయన విగ్రహం పెట్టాలన్నారు. కేటీఆర్ జీవితంలో సర్పంచ్ కూడా కాలేడని, రేపటి ధర్నాకు వెయ్యి మంది కూడా రారన్నారు.

## ఎవరివైనా కూలగొట్టుడే..

### చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ



ఇల్లీగల్ నిర్మాణాలు కూల్చాలని చెప్పిన కేటీఆర్., కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఫ్ టీఎల్ లో ఎక్కువ కాంగ్రెస్ మంత్రుల ఫామ్ హౌస్ లే ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. ఎవరివి ఉన్నా ఆధారాలు ఇస్తే కూలగొట్టుడేనని ఎంపీ చెప్పారు. పది ఏండ్లు అధికారంలో ఉండి జన్వాడ ఫాం హౌస్ ని లీజుకు తీసుకున్నప్పుడే మీ పరిస్థితి అర్థమైందన్నారు. ఫిరంగి కాల్వలను పూడ్చి ఫామ్ హౌస్ కట్టారన్నారు. కూల్చివేతలపై ఏమైనా ఇబ్బందులుంటే లిఖిత పూర్వకంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఇవ్వాలని సూచించారు. హైడ్రా పారదర్శకంగా పని చేస్తుందని, హైడ్రాలో పేదలకు అన్యాయం జరిగితే వాళ్లకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. కాగా, కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహం రోడ్డు మీద పెట్టాలని చూశాడని, కాంగ్రెస్ గుండెల్లో పెట్టు కోవాలని చూస్తున్నదన్నారు. అందుకే సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని సీఎం ఏర్పాట్లు చేస్తున్నాడన్నారు. పది ఏండ్లలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టక గాడిద పండ్లు తోమారా అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో రుణమాఫీ పూర్తిగా చేయలేకపోతే మిమ్మల్ని కొట్టినట్టు జనం మమ్మల్ని కూడా కొడతారన్నారు. కేటీఆర్ కు సమాధానం ఇద్దామనుకుంటే తన అకౌంట్ బ్లాక్ లోపెట్టాడన్నారు. రూలింగ్ పార్టీకి పాలించడానికి ప్రతిపక్షం అవకాశం ఇవ్వాలన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్ల బడ్జెట్ ఖర్చు పెట్టాలని ప్రభుత్వం అనుకుందని, ఇంకా రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు.

## జన్వాడ వ్యవహారం తెలిసిందే..

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్



ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా హైడ్రా కాపాడే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తుందన్నారు. గతంలో జన్వాడ ఫాం హౌజ్ లో జరిగిన తతంగం అందరికీ తెలుసన్నారు. జంటజలాశయాలకు నీళ్లు వచ్చే నాలాలను పూడ్చి కట్టారని ఆరోపించారు. ఆ విషయాన్ని రేవంత్ బయటకు తీసుకొచ్చారని, ప్రజలముందు ఉంచే ప్రయత్నం చేస్తే రేవంత్ ను అరెస్ట్ చేయించి జైల్లో పెట్టించారన్నారు. పోలీస్ అధికారుల రిపోర్ట్ ప్రకారం అది కేటీఆర్ ఫామ్ హౌస్ అని తేలిందని దానిని ఎఫ్టీఎల్ జోన్ లో ఎలా కడతారన్నారు. అది పేరుకే ప్రదీప్ రెడ్డి అని, కేటీఆర్ కు సంబంధించిందే అన్నారు. ఉద్యమ ముసుగులో భూముల పై కన్నేశారని, జన్వాడ ఫామ్ హౌస్ కూడా ఓ ప్రైవేట్ వ్యక్తిని భయపెట్టి లాక్కున్నాడన్నారు. రేవంత్ డ్రోన్ లు తిప్పాడని చెప్పిన సమయంలో అక్కడ కేటీఆర్ ఎందుకున్నాడని, అది కేటీఆర్ ఫామ్ హౌసే అన్నారు.

## చెరువుల పరిరక్షణే ప్రధానం..

జనపదం, హైదరాబాద్: హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలపై హైడ్రా ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకు హైడ్రా అధికారులు 70 భవనాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రహరీలు కూల్చివేశారు. మంగళవారం గండిపేటలోని ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. ఒక్క గండిపేటలోనే 20కి పైగా భవనాలను కూల్చేశారు. చందానగర్ సర్కిల్ మదీనాగూడ చెరువులో 3, బాచుపల్లిలోని ఎర్రకుంటలో 3, గాజులరామారంలో 42 భవనాలను నేలమట్టం చేశారు. చెరువులను పరిరక్షించడమే అధికారులు తొలి ప్రాధాన్యతగా తీసుకున్నారు.

### అఫిడవిట్లో జన్వాడ ముచ్చట..

కేటీఆర్ 2018 ఎన్నికల అఫిడవిట్‌లో జన్వాడ ఆస్తి వివరాలను పొందుపర్చారు. సతీమణి శైలజ పేరుతో ఆస్తి ఉన్నట్లు జన్వాడ ఫామ్ హౌజ్ వివరాలు పేర్కొన్నారు. బుధవారం ఫామ్ హౌజ్ తో తనకు సంబంధం లేదన్నట్టుగా మాట్లాడిన కేటీఆర్ మరి అఫిడవిట్ సంగతేంటో చెప్పాలని పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

### హైడ్రా.. హైకోర్టు సూటి ప్రశ్న..

జనపదం, లీగల్: హైడ్రా లీగల్ స్టేటస్, విధివిధానాలు ఏంటని హై కోర్ట్ ఏఏజీని సూటిగా ప్రశ్నించింది. ఏ ప్రాతిపదికను హైడ్రాను ఏర్పాటు చేశారని అడిగింది. రేపటి వరకు జాన్వాడ ఫామ్ హౌస్ కూల్చివేత చేపట్టవద్దని ఆదేశించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపున వాదనలు ఇలా వినిపించారు. హైడ్రా పేరుతో హైడ్రామా క్రియేట్ చేస్తున్నారని, ఆగస్టు 14న కొంత మంది అధికారులు జాన్వాడ ఫామ్ హౌస్ కి వచ్చి కూల్చివేస్తామని బెదిరించారన్నారు. ఇందులో వాటర్ వర్క్స్ తో పాటు సివేజ్ బోర్డును పార్టీలుగా చేర్చలేదన్నారు. కాగా, ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేయడం అభినందిస్తున్నామని హైకోర్టు అంది. కానీ ఏర్పాటు, కమిషనర్ కు ఉన్న పరిధులు ఏమిటని ప్రశ్నించింది. నిర్మాణాలకు ఒక ప్రభుత్వ శాఖనే అనుమతులు ఇస్తుంది, మరో శాఖ కూల్చివేస్తుందని అదేలా అంది. 20 సంవత్సరాల క్రితం కట్టుకున్న బిల్డింగ్ ను హైడ్రా కమిషనర్ ఇప్పుడు కూలుస్తున్నారని హైకోర్టు కాస్త అసహనం వ్యక్తం చేసింది.

## సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలి

### మాజీ మంత్రి హరీశ్ రావు

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలోని కానిస్టేబుళ్ల సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు కొన్ని జిల్లాలకు మాత్రమే ఇచ్చి మరికొన్ని జిల్లాలను విస్మరించడం బాధాకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలోని దాదాపు 6వేల మంది కానిస్టేబుల్స్‌కు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో పెట్టారని, పెట్రోల్, డీజిల్ బిల్లులు కూడా నెలల తరబడి రాక పోలీసులు, పెట్రోల్ బంక్ వారు కూడా ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీరి పట్ల ఎందుకు ఇంత వివక్ష.? రాష్ట్ర పోలీసులలో వీళ్లు భాగం కాదా..? ఒకే డిపార్ట్మెంట్లో ఇంత పక్షపాతం ఎందుకు..? ఇది వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే.. యూనిఫామ్ సర్వీస్ వాళ్లు కాబట్టి వాళ్లు బయటకు రాలేకపోతున్నారని, వాళ్ళ సమస్యను దృష్టికి తెస్తున్నానని తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# మూడు గంటలు ముచ్చెమటలు..

- కాళేశ్వరం స్కాం పై బహిరంగ విచారణ
- కమిషన్ క్రాస్ ఎగ్జామింగ్
- మాజీ ఈఎన్సీ పై ప్రశ్నల వర్షం
- తప్పులు జరిగాయని ఒప్పుకున్న మురళీధర్

**జనపదం, బ్యూరో** : కాళేశ్వరం ఘటనపై జస్టిస్ పీసీ ఘోష్ తన బహిరంగ విచారణను మొదలు పెట్టింది. బుధవారం నుంచి కమిషన్ తన క్రాస్ ఎగ్జామింగ్ ను మొదలుపెట్టింది. మురళీధర్ ను 8 పేజీల ప్రశ్నలను సంధించిన కమిషన్ చైర్మన్ పినాకీ చంద్ర ఘోష్ మూడు గంటలు ముచ్చెమటలు పట్టించారు. ఇందులో భాగంగా మాజీ ఈఎన్సీ మురళీధర్ ను ప్రశ్నించింది. విచారణకు ముందు కోర్టు తరహాలో అన్ని నిజాలే చెబుతానని మురళీధర్ తో దేవుని మీద ప్రమాణం చేయించిన కమిషన్ చీఫ్ అఫిడవిట్ నీదేనా.... అందులో ఉన్న సంతకాలు నీవేనా? ఇందులో ఇచ్చిన సమాచారం మీరే ఇచ్చారా మురళీధర్ ను ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ముందు మీరు ఏం చేశారు? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మీ పోస్ట్ ఏంటి అని ఈ ఎన్ సీ గా కాళేశ్వరం ప్రాజెక్టులో మీ పాత్ర ఏంటి అని మురళీధర్ పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. డీపీఆర్ ఎవరు సిద్ధం చేశారు. అని ప్రశ్నించిన కమిషన్ – డీపీఆర్ యాప్ కాన్ సంస్థ ద్వారా తయారు అయిందని మురళీధర్ సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు అందాయి అని ప్రశ్నకు కాళేశ్వరం కం ప్రాజెక్ట్ నిర్మాణానికి 17 రకాల అనుమతులు సెంట్రల్ స్టేట్ నుంచి తీసుకున్నామని సమాధానం ఇచ్చారు. దాదాపు పనులు పూర్తికాకముందే, క్వాలిటీ టెస్టులు చేయకుండా బిల్లులు ఎలా చెల్లించారు? మూడు బ్యారేజీల డిజైన్స్ మధ్యలో ఎందుకు మార్చారు? అని కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు తప్పులు జరిగాయని మాజీ ఈఎన్సీ మురళీధర్ ఒప్పుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల తప్పిదాల వల్ల కొంత నష్టం జరిగిందన్నారు.

# ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎంకు భారీ ఊరట..

**రెండు పిటిషన్లను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు**

**జనపదం, న్యూఢిల్లీ** : సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్కే దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. రాజకీయ కక్ష్య సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనర్ రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఆ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.

# నేటి నుంచి సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

- హాజరు కానున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శి డా.నారాయణ
- చారిత్రక నగరం హనుమకొండలో ఏర్పాట్లు పూర్తి

**జనపదం, హనుమకొండ** : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలకు చారిత్రక వరంగల్ మహా నగరం మరోసారి వేదిక అయింది. ఈ నెల 22 నుండి 24 వరకు మూడు రోజుల పాటు హనుమకొండలో సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వేదికగా మూడు రోజుల పాటు ఈ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, దేశం, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడంపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు సమావేశాల నిర్వహణకు హనుమకొండ పట్టణంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కాగా, సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగనున్న హనుమకొండ నగరం జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్ లతో ఎరుపెక్కింది. ప్రధాన దారుల వెంట, కూడళ్లలో ఎర్ర జెండాలు రెపరెపలాడుతుండగా సమావేశాలు జరిగే హరిత హోటల్ ప్రాంతంలో జాతీయ, రాష్ట్ర నాయకులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

# ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్ ...

- 16 మంది మృతి..50మందికి పైగా గాయాలు..
- ఛిద్రమైన కార్మికుల శరీరాలు..
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు

**జనపదం, ఆంధ్రప్రదేశ్:** ఏపీ రాష్ట్రం అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి మండలం అచ్యుతాపురం సెజ్‌లో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 16 మంది మృతి చెందారు. 50 మందికి పైగా గాయాలయ్యాయి. బాధితులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశించారు. 500 కిలో లీటర్ల సామర్థ్యం గల రియాక్టర్ పేలడంతో ప్రమాద తీవ్రత భారీగా ఉంది. పేలుడు సమయంలో 387 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. కార్మికులు షిప్టు మారే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలుడు ధాటికి కంపెనీ మొదటి అంతస్తు శ్లాబ్ కూలింది. కార్మికుల మృతదేహాలు ఛిద్రమైపోయాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# హైడ్రానా.. హై డ్రామానో తెలియడం లేదు

- అక్రమ నిర్మాణాలప్పుడు ప్రభుత్వాలేం చేశాయి..
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రసక్తే లేదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రెస్ మీట్




**జనపదం, హైదరాబాద్** : ''ఇప్పుడు అక్రమ నిర్మాణాలు అని కూల్చుతున్నవన్నీ అనుమతి ఇచ్చినప్పుడు తెలియదా.? ఆ వేళ ఎందుకు పర్మిషన్లు ఇచ్చారు. ప్రభుత్వాలపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది..'' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏ ప్రాతిపాదికన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.. ఇప్పుడు ఏ ప్రాతిపదికన కూల్చుతున్నారో చెప్పాలన్నారు. హైడ్రా చిత్తశుద్ధిపై ప్రజలకు అనుమానాలున్నాయని, ఆక్రమణల నుంచి చెరువులు, పార్కులు, మైదానాలను కాపాడాలన్నారు.

**బీజేపీ అధికార ప్రతినిధిగా రేవంత్..**

సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ అధికారప్రతినిధిగా మారారని, బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారన్నారు. కేసీఆర్ కాంగ్రెస్ లో రాజకీయ జీవితం ప్రారంభించారని, అలాగని ఆ పార్టీ జెండా కప్పుకునే కడవరకు ఉంటారా అని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడిని జాతీయ నాయకత్వం నిర్ణయిస్తోందని, తాను పార్టీకి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్న మాట వాస్తవం అన్నారు. అధ్యక్షుడి మార్పు సహజంగా జరుగే ప్రక్రియే అని గుర్తు చేశారు. సచివాలయం ఎదుట ఎవరి విగ్రహం పెడతామో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చెబుతామని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు.

**ఆ పార్టీలతో ప్రజలు విసిగిపోయారు..**

బీఆర్ఎస్, కాంగ్రెస్ పై తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీపై వాస్తవాలను ప్రభుత్వం ప్రజల ముందు పెట్టాలని, అలాగే అధికారం పోయినా బీఆర్ఎస్ వ్యవహారంలో మార్పు రాలేదని, ప్రజలే తప్పు అన్నట్లు కేసీఆర్ కుటుంబం అహంకారంతో వ్యవహరించడం సరికాదన్నారు. అప్పుడు కేసీఆర్ మాదిరిగానే ఇప్పుడు రేవంత్ రెడ్డి ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారని, రాజీనామా చేయించకుండానే ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారన్నారు. రాష్ట్ర సర్కార్ పాలనపై సమయం కేటాయించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందని, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారో ఇప్పటికైనా చెప్పాలని, బీజేపీ తెలంగాణకు ఎంతో చేస్తుంటే ఏమీ చేయలేదని కాంగ్రెస్, బీఆర్ఎస్ బద్నాం చేయడం సరికాదన్నారు. కశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని జోస్యం చెప్పారు.

# మాటకు కట్టుబడి మాఫీ..

- ఒకేసారి రూ.రెండు లక్షల రుణమాఫీ చేశాం..
- అవగాహన లేకే అవాకులు చెవాకులు
- రాష్ట్ర సంపదను పేదవారికి చేరుస్తాం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**జనపదం, ఖమ్మం :** ఎన్నికలకు ముందు రైతులకిచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని జమలాపురం లో ఏర్పాటు చేసన ఓ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొని మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ గురించి అవగాహన లేనివారు అవాకులు చెవాకులు పేలుతున్నారన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయలేని వాళ్లు మొదటి సంవత్సరంలోనే రూ2 లక్షల రుణమాఫీ చేసిన వారి గురించి సిగ్గు.. ఎగ్గూ లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రూ.రెండు లక్షలపైగా బ్యాంకు రుణం తీసుకున్న రైతులు పై మొత్తాన్ని చెల్లించి వ్యవసాయ శాఖకు సమాచారం ఇస్తే వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందన్నారు.

**ఏడాదిలోపే..**


రుణమాఫీ కి సంబంధించి దేశంలో ఎవరు ఊహించని విధంగా, ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఒకేసారి రూ. రెండు లక్షల రుణమాఫీ చేశామని, అది కూడా అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే పూర్తి చేశామని డిప్యూటీ సీఎం అన్నారు. జూలై 17న రుణమాఫీ జీవో ఇచ్చి వెంటనే 18న మొదటి విడత రూ.లక్ష వరకు రుణం ఉన్నవారి ఖాతాలో డబ్బులు జమచేశామని, రెండో విడత 15 రోజుల వ్యవధిలోనే ఆలస్యం జరగకుండా జూలై 30న అసెంబ్లీలో రూ.లక్షన్నర వరకు బ్యాంకు రుణం ఉన్నవారికి వారి ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ఇక మూడో విడత ఆగస్టు 15న వైరా బహిరంగ సభలో రూ.రెండు లక్షల వరకు బ్యాంకు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి నగదు జమ చేశామని భట్టి గుర్తు చేశారు. గత పాలకులు 2014 నుంచి 2018 వరకు రూ.లక్ష రుణం ఐదేళ్ల కాలంలో నాలుగు వాయిదాలలో చెల్లించారని, వారు వాయిదాల్లో చెల్లించడంతో అది వడ్డీలకే సరిపోయిందని, దీంతో బ్యాంకర్లు రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వలేకపోయారని వా పోయారు. రెండో దఫా అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్నికల ముందు అరకొరగా రైతులకు రుణమాఫీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, బీఆర్ ఎస్ లాగా దోపిడీలు చేయదని, రాష్ట్ర సంపద ప్రతి పైసాను పేదవారికి చేరుస్తామని భట్టి స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ రైతుల పక్షం**

గత పదేళ్లుగా పంటల భీమా కూడా చేయని దుర్మార్గులు వారని, వారి హయాంలో పంట నష్టపోతే ఒక్క రూపాయి కూడా రైతులకు రాలేదని భట్టి అన్నారు. మేము అధికారంలోకి రాగానే పంటల బీమా, రైతుబీమా డబ్బులు కూడా రైతుల పక్షాన ప్రభుత్వమే ఇప్పటికే చెల్లించిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయం అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు తాజా బడ్జెట్లో కేటాయించామని, తత పాలకులు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు కూడా ప్రింట్ చేయలేదని, మేము అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. ఐదు లక్షల నుంచి రూ. 10 లక్షల పెంచామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించామని, మహిళల పక్షాన ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు కడుతుందని గుర్తు చేశారు. రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నామని, ఐదేళ్ల కాలంలో రూ. లక్ష కోట్ల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నామని, త్వరలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఖరారు చేసి.. భూమి పూజలు చేయనున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ కూల్చివేతపై స్టే ఇవ్వలేం

- స్పష్టంచేసిన తెలంగాణ హైకోర్టు
- నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని సూచన
- హైడ్రా కూల్చిన కట్టడాల వివరాలు ఇవ్వాలన్న కోర్టు





**జనపదం, హైదరాబాద్:** జన్వాడ ఫామ్ హౌస్ కూల్చొద్దంటూ ఆ ఫామ్ హౌజ్ యజమాని ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఫామ్‌హౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీని ధర్మాసనం కోరింది. అంతేగాకుండా కూల్చివేతలపై హైడ్రా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇప్పటివరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది..? ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా.. లేదా..? అనే వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా..? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని చెప్పారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కోరారు. కాగా 2014 లో జన్వాడలో ఫామ్‌హౌస్ ఏర్పాటు చేశారని, 2019 లో ప్రదీప్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను కొనుగోలు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫామ్‌హౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు..? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా..? అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని కోర్టు కోరింది. దీంతో ప్రాథమికంగా నోటిఫై చేశామని, తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

# పోలాండ్ చేరుకున్న ప్రధాని..

- రాజధాని వార్సాలో ఘన స్వాగతం
- తొలి భారతీయ నాయకుడు మోడీనే..



**జనపదం, న్యూ ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రెండు రోజుల పోలాండ్ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. కొద్దిసేపటి క్రితమే మోడీ పోలాండ్ చేరుకున్నారు. 45 ఏళ్లలో సెంట్రల్ యూరప్ దేశాన్ని సందర్శించిన తొలి భారతీయ నాయకుడు ప్రధాని మోడీయే కావడం విశేషం. భారత్, పోలాండ్ దేశాల దౌత్య సంబంధాలు 70 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రధాని మోడీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పోలాండ్ కు చేరుకున్న మోడీకి రాజధాని వార్సాలో ఘన స్వాగతం పలికారు. కాగా, మోడీ పోలాండ్ పర్యటనకు రావడంతో అక్కడి ప్రవాస భారతీయులు ఆనందం వ్యక్తం చేశారు. మోడీ బస చేయబోయే హోటల్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. “మా ప్రధాని పోలాండ్‌కు రావడం మాకు సంతోషకరమైన విషయం. ఇది భారతదేశం–పోలాండ్ సంబంధాలను మెరుగుపరిచే ముఖ్యమైన పర్యటన. ఇది పోలాండ్ నుండి భారతదేశానికి పెట్టుబడులను తీసుకురావడానికి సహాయపడుతుంది” అని భారత సంతతి పౌరులు తెలిపారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**జనపదం, హైదరాబాద్ :** ఈ మధ్యకాలంలో బంగారం రేట్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తాజాగా బంగారం రేట్లు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్లో బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి రూ.550 పెరిగి రూ.73,200కి చేరింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.500 పెరిగి రూ. 67,100 పలుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.67,250 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.73,350 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల తులం ధర రూ.53,800గా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.



# ఆందోళన వద్దు. అర్హులకు మాఫీ చేస్తాం..

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలపై దృష్టి సారించాం..
- నేటి నుంచి వారం పాటు గ్రామాలకు అధికారులు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**జనపదం, నిజామాబాద్ :** రుణమాఫీపై అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి గురించే ప్రభుత్వం ఆలోచన చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి రైతుకు రుణం మాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. రైతు సమస్యలు పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆందోళనలు విరమించాలని రైతు సంఘాలకు, రైతు నాయకులకు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ విషయంలో మీ వద్దకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన సమస్యలను తమకు కానీ, కలెక్టర్ కు కానీ తెలపాలని, అధికారులతో కలిసి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాధాన్యత లేదని, తమ దృష్టికి వచ్చిన వెంటనే ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించామన్నారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు గ్రామాల్లోకి వస్తారని, రైతులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. పదేళ్లుగా మోసం చేసిన పార్టీలను నమ్మి పరేషాన్ కావొద్దని, రూ.31వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**గ్రామాలకు అధికారులు**

రుణమాఫీ విషయంలో ఆందోళనలు అవసరం లేదని, సాంకేతిక కారణాల ద్వారా రైతుల ఇబ్బంది ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, పరిష్కరించి రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించాలని ఇప్పటికే బ్యాంక్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామాలకు రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు గ్రామపంచాయతీకి, రైతు వేదికలకు వస్తారని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

**మాట తప్పిన బీఆర్ఎస్**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని, ముఖ్యంగా రుణమాఫీ విషయంలో మాట తప్పిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కానీ తమ ప్రభుత్వం ఈ రోజు రెండు లక్షల రుణమాఫీ చేయడానికి సిద్ధంగా వుందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికి బీఆర్ ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని, రుణమాఫీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. అ ర్హులైన అందరికీ రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హ్యందాన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశం కోసం కోసం బీజేపీ..

**కమలం కేడర్ బేస్డ్ పార్టీ ...**

- వ్యక్తులు, కుటుంబం ముఖ్యం కాదు..
- ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు
- ఉద్యమంగా సభ్యత్వ నమోదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ :** దేశం కోసం బీజేపీ అని, వ్యక్తులు, కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేసేది భారతీయ జనతా పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీ బీజేపీ అన్నారు. పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు కార్యకర్తలంతా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త వంద మందిని సభ్యులుగా చేర్పించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను దృష్టిలో పెట్టుకొని సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలాగా చేయాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, దీనికి సభ్యత్వం కీలకమని కేంద్ర మంత్రి తెలిపారు. అవకాశం ఉంటే ఆన్ లైన్ సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 77లక్షల ఓట్లు వచ్చాయని, వేలాది బూత్ లలో బీజేపీ నంబర్ వన్ గా నిలిచిందని గుర్తు చేశారు.

**రుణమాఫీ 50 శాతం కూడా కాలే..**

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటికి తూట్లు పొడుస్తుందని కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం కూడా రుణమాఫీ జరగలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై వాస్తవ పరిస్థితులు బయట పెట్టాలని, లేకుంటే ఆ వివరాలు బీజేపీయే బయట పెడుతుందన్నారు. ఏ గ్రామంలో రుణమాఫీ పూర్తిగా కాలేదని చెప్పారు. ఒక వైపు సభ్యత్వం చేస్తూనే రైతుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుందన్నారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లిబరేషన్ డే ను చేయాలన్నారు.

# ఇన్ ఫార్మర్ నెపంతో హత్య..

- మహిళను చంపిన మావోయిస్టులు
- చెన్నాపురం సమీపంలో మృతదేహం
- విప్లవ ద్రోహి నీల్సో.. అంటూ లేఖ



**జనపదం, క్రైం:** పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ మహిళా మావోయిస్టును మావోయిస్టులే హతమార్చారు. ఆమె మృతదేహాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం సమీపంలో బుధవారం ఉదయం వదిలివెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా కాప్రాకు చెందిన పల్లెపాటి రాధ అలియాస్ నీల్సో నర్సింగ్ విద్య పూర్తి చేసింది. అనంతరం 2018లో విప్లవోద్యమంలో చేరింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న దళసభ్యులకు నీల్సో (34) వైద్యం అందిస్తోంది. అయితే ఇటీవల నీల్సో కదలికలపై అనుమానం వ్యక్తం చేసిన పార్టీ ప్రత్యేక నిఘా పెట్టింది. అకున్నట్టుగానే ఆ అనుమానం కాస్త నిజం కావడంతో నీల్సోను బాధ్యతల నుంచి తొలగించింది. ఇన్‌ఫార్మర్‌గా మారి తమ సమాచారం పోలీసులకు చేరవేస్తుందనే నెపంతో ఆమెను మావోయిస్టులు హతమార్చారు. మృతదేహాన్ని తీసుకొచ్చి చెన్నాపురం మీపంలో వదిలి వెళ్లారు. అయితే నీల్సో మృతదేహం వద్ద ఆంధ్రా–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరుతో లేఖ వదిలి వెళ్లారు. విప్లవ ద్రోహి నీల్సో అని, అందుకే ఆమెను హతమార్చినట్లు లేఖలో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న చర్ల సీఐ రాజువర్మ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు పంచనామా నిమిత్తం తరలించారు.



# న్యూయార్క్ పిచ్‌లకు రేటింగ్

## బాగున్నాయంటూ ఐసీసీ కితాబు

**జనపదం, స్పోర్ట్స్:** టీ20 వరల్డ్ కప్ 2024 ముగిసి నెలన్నర అయిపోయింది. అయితే ఈ ప్రపంచ కప్ కోసం న్యూయార్క్‌లో వినియోగించిన పిచ్‌లపై విమర్శలు ఎదురైన సంగతి తెలిసిందే. బౌలర్లకు వరంగా మారిన ఈ పిచ్‌లపై బ్యాటర్లు పరుగులు కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అయితే చాలా రోజుల తర్వాత తాజాగా ఐసీసీ ఈ పిచ్‌లపై రేటింగ్‌ఇచ్చింది. సాధారణంగా ఒక టోర్నీ లేదా సిరీస్ ముగిసిన తర్వాత ఐసీసీ రేటింగ్‌లను ప్రకటిస్తుంది. కానీ ఈ సారి మాత్రం టీ20 వరల్డ్ కప్ ముగిసిన చాలా రోజులకు ఐసీసీ స్పందించింది. సంతృప్తికరం రేటింగ్‌ను ఇచ్చింది. ఈ టీ20 వరల్డ్ కప్‌లో న్యూయార్క్ మొత్తం ఎనిమిది మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వగా ఈ మ్యాచ్‌లన్నింటిలోనూ స్వల్ప స్కోర్లే నమోదవ్వడం విమర్శలకు దారీ తీసింది. అయితే ఇప్పుడు ఈ ఎనిమిది మ్యాచుల్లో ఆరు మ్యాచ్‌లకు వినియోగించిన పిచ్‌లు సంతృప్తికరంగా ఉన్నాయని ఐసీసీ వెల్లడించింది. వీటిలో టీమ్‌ఇండియా - పాకిస్థాన్ మ్యాచ్ కూడా ఉంది. ఈ పోరులో టీమ్ ఇండియా 119 పరుగులకు ఆలౌట్ అవ్వగా పాక్ స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక 113/7కే చేతులెత్తేసింది. ఇకపోతే టీమ్ ఇండియా - ఐర్లాండ్ మ్యాచ్‌తో పాటు శ్రీలంక-దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌కు ఉపయోగించిన పిచ్ బాలేదని, అసంతృప్తిగా ఉందని పేర్కొంది. అయితే అమెరికాలో ప్రస్తుతం క్రికెట్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని ఐసీసీ ఈ రేటింగ్‌లు ఇచ్చిందని, అందుకే కఠినంగా వ్యవహరించలేదని వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తంగా ఈ టీ20 వరల్డ్ కప్‌లో 52 మ్యాచులు జరిగాయి. ఇందులో కేవలం 3 పిచ్‌లు మాత్రమే బాలేదు అనే రేటింగ్ ఇచ్చింది ఐసీసీ. ఇక ఫైనల్‌కు ఆతిథ్యం ఇచ్చిన బ్రిడ్జ్‌టౌన్ ట్రాక్ చాలా బాగుంది అని రేటింగ్ ప్రకటించింది.



# మేటి వికెట్ కీపర్ ధోనినే..

## ఆసీస్ లెజెండ్ గిల్‌క్రిస్ట్

జనపదం, స్పోర్ట్స్: ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ ఆడం గిల్‌క్రిస్ట్ పేరు వింటే చాలు విధ్వంసక ఇన్నింగ్స్‌లే కళ్లముందు తిరుగుతాయి. వికెట్ కీపర్‌గానూ తన ముద్ర వేసిన గిల్‌క్రిస్ట్ తాజాగా టాప్-3 వికెట్ కీపర్ బ్యాటర్లు ఎవరో చెప్పాడు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మేటి వికెట్ కీపర్ అని ఆసీస్ లెజెండ్ అభిప్రాయ పడ్డాడు. 'ఆసీస్ దిగ్గజం రొడ్నీ మార్ష్ ప్రపంచంలోనే అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్. అతడు నా ఆరాధ్య క్రికెటర్. ఇక ఎంఎస్ ధోనీ కూడా గొప్పవాడే. అతడి ప్రశాంతత నాకు నచ్చుతుంది. మైదానంలో మిస్టర్ కూల్ కెప్టెన్‌గానే ధోనీ ఎన్నో అద్భుతాలు చేశాడు. ఇక మూడో క్రికెటర్ ఎవరంటే.. కుమర సంగక్కర . బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా సంగక్కర ఎంతో స్టయిలిగా కనిపిస్తాడు' అని గిల్‌క్రిస్ట్ వెల్లడించాడు.

### రొడ్నీ మార్ష్

నవంబర్‌లో కంగారూల గడ్డపై జరుగబోయే బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీపై కూడా గిల్‌క్రిస్ట్ స్పందించాడు. ఈసారి తమ జట్టు విజేతగా నిలుస్తుందని అతడు జోస్యం పలికాడు. 'స్వదేశంలో తాము ఎంత శక్తివంతులమో నిరూపించాల్సిన బాధ్యత ఆసీస్‌పై ఉందన్నారు. మరోవైపు భారత జట్టుకు విదేశాల్లో సిరీస్‌లు ఎలా గెలవాలో బాగా తెలుసని, అయితే.. కమిన్స్ సేన సిరీస్ విజేత అవుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇరుజట్ల మధ్య తగ్గ పోరు ఉండడం ఖాయమన్నారు. ఈ ఏడాది నవంబర్ 26వ తేదీన బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ మొదలవ్వనుంది. 2017 నుంచి ఈ ట్రోఫీని గెలుస్తూ వస్తున్న టీమిండియా మళ్లీ ఆస్ట్రేలియాకు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉంది.

# ఐసీసీ చైర్మన్ రేసులో జై షా..!

**జనపదం, స్పోర్ట్స్:** భారత్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా కార్యదర్శి జై షా ఐసీసీ చైర్మన్ రేసులో ఉన్నారు. ఐసీసీ ప్రస్తుత అధ్యక్షుడు గ్రెగ్ బార్ క్లే పదవీ కాలం నవంబర్ 30వ తేదీతో ముగియబోతోంది. మళ్లీ పోటీ చేయాలనే ఆసక్తి తనకు లేనట్టు బార్ క్లే ఇప్పటికే ఐసీసీ సభ్యులకు తెలియజేశాడు. దీంతో జై షా ఐసీసీ చైర్మన్ ఎన్నికల బరిలో నిలిచే అవకాశాలు పుష్కలంగా కనబడుతున్నాయి. ఈ నెల 27వ తేదీన ఈ విషయమై పూర్తి స్పష్టత రాబోతోంది. చైర్మన్ పోస్ట్ కోసం నామినేషన్లు వేసేందుకు 27వ తేదీ ఆఖరి రోజు కావడమే అందుకు కారణం. ఐసీసీ నిబంధనల ప్రకారం ఎవరైనా వ్యక్తి మూడు పర్యాయాలు చైర్మన్‌గా ఉండొచ్చు. ఒక్కో టర్మ్‌కు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. అంటే ఎవరైనా వ్యక్తి గరిష్టంగా ఆరు సంవత్సరాలు ఐసీసీ చైర్మన్ హోదాలో ఉండొచ్చు. న్యూజిలాండ్‌కు చెందిన బార్ క్లే ఇప్పటికే నాలుగేళ్లు ఆ పదవిలో ఉన్నాడు. 2020 నుంచి ఐసీసీ చైర్మన్‌గా కొనసాగుతున్నాడు. ఈ ఏడాది నవంబర్ 30తో అతడి పదవీ కాలం పూర్తవుతోంది. మూడో సారి పోటీ చేసే ఆలోచన లేదని తేల్చి చెప్పాడు. దీంతో జై షా ఎన్నికల బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఐసీసీ చైర్మన్ ఎన్నికల్లో మొత్తం 16 మంది సభ్యులు ఓట్లు వేయాల్సి ఉంది. వారిలో 9 మంది ఓట్లు ఎవరికి పడితే వారు ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికవుతారు. ప్రస్తుతానికి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మెంబర్లతో సహా ఎక్కువ మంది షా వైపే ఉన్నట్టు



తెలుస్తోంది. ప్రస్తుతం బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న షాకు మరో ఏడాది పదవీ కాలం ఉంది. ఆ తర్వాత అతడు తప్పనిసరిగా బీసీసీఐ పదవుల నుంచి మూడేళ్ల పాటు తప్పుకోవాలి. కాగా, ఇంతకు ముందు భారత్‌కు చెందిన జగన్మోహన్ దాల్మియా (1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసీసీ చైర్మన్ హోదాలో పని చేశారు. ప్రస్తుతం ఆ అవకాశం జై షా ముంగిట నిలిచింది. జై షా ప్రస్తుతం ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల ఉప సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు.

# పికిల్ బాల్.. మీకు తెలుసా..?



## సమంత ఫ్రాంచైజీ కొనుగోలుతో.. గేమ్ పై చర్చ

**జనపదం, స్పోర్ట్స్:** హీరోయిన్ సమంత వరల్డ్ పికిల్‌బాల్ లీగ్‌లో ఓ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడంతో అందరి దృష్టి ఆ గేమ్ పై పడింది. పికిల్‌బాల్ గేమ్ అంటే ఏంటి? ఎలా ఆడతారు? దాని రూల్స్ ఎలా ఉంటాయి..? అని తెలుసుకుంటున్నారు..? ఈ పికిల్‌బాల్ గేమ్ చూడటానికి టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌ను పోలి ఉంటుంది. ఇది 1965లో అమెరికాలో ప్రారంభమవ్వగా ఇప్పుడిప్పుడే మన దగ్గర అడుగులేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ గేమ్ పెద్ద టోర్నీలు జరుగుతుంటాయి. ఇండోర్, అవుట్‌డోర్‌లోనూ దీనిని ఆడొచ్చు.



సింగిల్స్‌లో ఇద్దరు, డబుల్స్‌లో నలుగురు ఆడతారు. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ కాంపిటీషన్స్ నిర్వహిస్తుంటారు. ఈ గేమ్‌ను ఆడేందుకు చెక్కతో చేసిన పాడిల్, హార్డ్ ప్లాస్టిక్ బాల్‌ను ఉపయోగిస్తారు.

**రూల్స్ ఇవే**

ఈ ఆటకు స్పెషల్ రూల్స్ ఉంటాయి. ఈ గేమ్ ఆడే కోర్టు 44 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉంటుంది. నెట్ ఎత్తు కేవలం 36 అంగుళాలే. టెన్నిస్‌లో రెండు ఫాల్ట్‌లు చేస్తే సర్వీస్ పోయినట్టు కదా, కానీ పికిల్‌బాల్‌లో మాత్రం ఒక్క ఫాల్ట్ ఉంటుంది. డబుల్స్‌లో ఒకసారి మాత్రమే సర్వ్ చేసే ఛాన్స్ ఉంటుంది. ఆట మొదలయ్యాక కనీసం ఒక్కసారైనా బంతి నేలపై బౌన్స్ అయితేనే షాట్ కొట్టాలి. ఆ తర్వాత డైరెక్ట్‌గా బంతిని కొట్టవచ్చు. ఈ పికిల్‌బాల్ గేమ్‌లో సర్వ్ చేసినప్పుడే పాయింట్లు లభిస్తాయి. ప్రతీ సెట్ 11 పాయింట్లు అవ్వగానే ముగుస్తుంది. రెండు పాయింట్ల తేడాతో విన్నర్‌ను అనౌన్స్ చేస్తారు. టెన్నిస్‌లో లాగానే సర్వ్ చేసినప్పుడు లేదా గేమ్‌లో భాగంగా నెట్‌ను దాటి పోవాలి. ఇక సర్వ్ చేసేటప్పుడు నో వ్యాలీ జోన్ దగ్గర బాల్‌ను అందుకో కూడదు.



CINEMA NEWS సినిమా పదం

# క్యూట్.. హాట్..

తెలుగులో ఒక్క సినిమాతో ఫుల్ క్రేజ్ ను సొంతం చేసుకుంది రితిక నాయక్. అశోక వనంలో అర్జున కల్యాణం సెకండ్ ఫీ మేల్ లీడ్ రితికానాయక్ కనిపించింది. అద్భుత నటన, చూడచక్కని అందం , చందమామలాంటి ముఖ సౌందర్యం ప్రేక్షకులను ఆకర్షించాయి. దీంతో ఈ ముద్దుగుమ్మకు ఎనలేని క్రజ్ వచ్చింది. సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ తన లేత లేత అందాలను ఆరబోస్తూ కుర్ర కారుకి మరింత దగ్గరవుతుంది ఈ భామ. తాజాగా రితిక నాయక్ క్యూట్ లవ్లీ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# మహారాజ రికార్డుల మోత

కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి ఈ ఏడాది మహారాజ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో వచ్చిన మహారాజ జూన్ 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. థియేటర్లలో మంచి వసూళ్లు రాబట్టి నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. మహారాజ 28 రోజుల థియాట్రికల్ రన్ తర్వాత పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లోకి కూడా జూలై 12న డిజిటల్ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ చార్ట్స్‌లో (జూలై 8-14 మధ్యలో) నాలుగో స్థానంలో నిలిచి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. తాజాగా మరో అరుదైన ఫీట్ ఖాతాలో వేసుకుంది. నెట్‌ఫ్లిక్స్‌లో మహారాజ ఎక్కువ వ్యూస్ (18.6 మిలియన్ వ్యూస్) సాధించిన ఇండియన్ సినిమాగా అరుదైన రికార్డు నమోదు చేసింది. మహారాజ హిందీ చిత్రాలు (17.9 మిలియన్



వ్యూస్) అధిగమించింది. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న మహారాజ అన్ని వెర్షన్లలో రికార్డ్స్ సృష్టిస్తూ ఇండియాలో మొదటి నుంచి నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది.

# ది గోట్ సెన్సార్ పూర్తి..

తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' కోలీవుడ్‌లో మస్త్ హైప్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు వెంకట్ ప్రభు పూర్తి స్పై థ్రిల్లర్ మూవీగా తెరకెక్కించడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా పోస్టర్స్, టీజర్, సాంగ్స్, ట్రైలర్లతో మూవీపై హైప్ మరింత పెరిగింది. సెప్టెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కి రెడీ అయిన ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముగింపునకు చేరుకున్నాయి. తాజాగా ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్‌ను జారీ చేసినట్లుగా చిత్ర యూనిట్ తెలిపింది. దీంతో ఈ సినిమా రిలీజ్‌కు మరింత చేరువైంది.





# 24న సరిపోదా శనివారం ప్రీ-రిలీజ్

**న్యాచురల్ స్టార్ నాని** లేటెస్ట్ మూవీ 'సరిపోదా శనివారం' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని ఆగస్టు 29న గ్రాండ్ రిలీజ్‌కి రెడీ అయ్యింది. దర్శకుడు వివేక్ ఆత్రేయ ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించడంతో ఈ చిత్రాన్ని ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హీరో నాని, ప్రియాంక మోహన్, నిర్మాత డివివి దానయ్యలతో పాటు ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్న స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక ఈ మీడియా మీట్‌లో 'సరిపోదా శనివారం' చిత్ర ప్రీ-రిలీజ్ ఈవెంట్ డేట్‌ను వారు అనౌన్స్ చేశారు. ఆగస్టు 24న ఈ చిత్ర ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరగనుందని వారు తెలిపారు. దీంతో అభిమానులు ఈ ప్రీ-రిలీజ్ ఈవెంట్ కోసం ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఈవెంట్‌కి ఎవరు గెస్ట్‌గా వస్తారా.. ఈ ఈవెంట్ ఎక్కడ నిర్వహిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

# ముఫాసాకు మహేశ్ వాయిస్..



హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్స్ ప్రాజెక్టుల్లో ది లయన్ కింగ్ టాప్. ఈ క్రేజీ ప్రాజెక్టుకు ప్రీక్వెల్‌గా వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్. ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. కాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించాడని తెలిసిందే. ఇక తెలుగు వెర్షన్‌కు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడు. తాజా సమాచారం ప్రకారం తెలుగు ట్రైలర్ ఆగస్టు 26న ఉదయం 11:07 గంటలకు లాంచ్ చేయనుండగా.. ఈవెంట్‌లో మహేశ్ బాబు సందడి చేయనున్నాడని సమాచారం. లయన్ కింగ్ సినిమాకు తెలుగుతోపాటు హిందీ ఆయా భాషల్లో పలువురు నటులు డబ్బింగ్ చెప్పారని తెలిసిందే. ఇక తెలుగు లయన్ కింగ్ లోని సింబా పాత్రకు నాని డబ్బింగ్ చెప్పాడు. ది లయన్ కింగ్‌లో మొదటి రెండు పార్ట్‌లలో అడవికి రారాజుగా ఉన్న ముఫాసా తన రాజ్యాన్ని కాపాడుతూ ఉండడం అతడికి సింబా అనే కుమారుడు జన్మించడం చూడవచ్చు. అయితే ఈ ప్రీక్వెల్‌లో ముఫాసా అడవికి రాజుగా అసలు ఎలా ఎదిగాడు అతడికి సోదరుడు ఉన్న టాకా ఎలా చనిపోయాడు..? అలాగే ముఫాసా చంపాలని చూస్తున్న స్కార్ ఏం చేశాడు..? అనేది సినిమా స్టోరీ.